



అంతర్వేది తీరంలో
బోటు మునక

మత్స్య సంపద, వలలు నీటిపాలు
సముద్ర గర్భంలోకి బోటు 5లో

శనేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

కొత్తపేట, జూలై 13: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,26,015 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఈ సందర్భంగా ఆమె చెప్పారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జిల్లా పోలీస్ బాస్ కృష్ణారావు

- జిల్లా ఎస్పీగా 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన బొడ్డేపల్లి కృష్ణారావు నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ప్రస్తుత ఎస్పీ ఎస్.శ్రీధర్ బదిలీ
- ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్న నూతన ఎస్పీ

అమలాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బొడ్డేపల్లి కృష్ణారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ జిల్లా ఎస్పీగా పనిచేసిన ఎస్.శ్రీధర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణారావును కోనసీమ జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా సరిగ్గా 27 నెలల క్రితం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆవిర్భవించిన కాలంలో కృష్ణారావు నాలుగో ఎస్పీగా నియమితులు కావడం విశేషం. ఒకట్రెండు రోజుల్లో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటి వరకు జిల్లా ఎస్పీగా సమర్థవంతమైన సేవలు అందించిన శ్రీధర్ కొన్ని నెలల్లోనే ఇక్కడి నుంచి బదిలీ కావడం పట్ల పోలీసుశాఖలోని అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే జిల్లా కలెక్టర్‌గా రావిరాల మహేష్‌కుమార్‌ను నియమించారు. ఇప్పుడు ఎస్పీని కూడా మార్చారు. అటు కలెక్టర్, ఇటు ఎస్పీలు ఇద్దరూ కొత్తవారు కావడంతో పాలనాపరమైన ప్రక్షాళనా కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంది.

కలెక్టర్‌తో భేటీ

- కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసిన అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్
- వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వినతి



అమలాపురం టౌన్, జూలై 13: వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు సూచించారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ప్రణాళికలతో ముందుకు సాగాలని కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను శనివారం ఎంపీ కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రధానంగా తాగునీరు, రోడ్ల పరిస్థితులపై చర్చించారు. రైతులకు బకాయి పడ్డ ధాన్యం సొమ్ములను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అందిన వినతిపత్రాలను కలెక్టర్‌కు ఆయన అందజేశారు.

భక్తుల రద్దీ



మామిడికుదురు, జూలై 13: అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ2,64,151 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారిని 3,086 మంది దర్శించుకున్నారని, వారిలో 2274 మంది దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంలో అన్న ప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



పదవుల కోసం పోటీ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశావహుల చూపు ఇప్పుడు నామినేటెడ్ పదవులపై పడింది. పదవులను ఆశించే వారు ఎక్కువగా ఉండడం పంపకం కత్తిమీద సాములా మారింది. ఏదో ఒక కీలకమైన పదవిని దక్కించుకోవాలని కూటమి నేతలు పోటీ పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు త్యాగం చేయడంతో గతానికంటే భిన్నమైన పరిస్థితి నేడు నెలకొంది. ఒకటి కాదు, రెండు కాదు, మూడు పార్టీల నేతలను సమన్వయం చేసుకుని పదవుల పంపకం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది

● అమలాపురం రూరల్

- నామినేటెడ్ పదవులకు నేతల తహతహ
- కార్పొరేషన్ పదవులతో పాటు మార్కెట్ యార్డు కమిటీ పదవులపై దృష్టి
- దేవస్థానం చైర్మన్లు.. సొసైటీలకు తప్పని పోటీ
- ద్వితీయ శ్రేణి నాయకుల విజ్ఞాపనలతో తలలు పట్టుకుంటున్న ఎమ్మెల్యేలు

నామినేటెడ్ పోస్టుల కోసం నేతల కుస్తీ

నియోజకవర్గాలకు చెందిన కీలక నాయకులు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులపై దృష్టి సారిస్తే మరికొందరు నేతలు ప్రొటోకాల్ పదవుల కోసం ఆశ పడుతున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు నేతలైతే తమకు ఫలానా పదవి ఖరారు అయిపోయిందని అందుకు సంబంధించిన లావాదేవీలన్నీ పూర్తి అయ్యాయని బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు పక్కకు పోయి కొత్తకొత్తవారు తెరపైకి వచ్చే అవకాశం ఉందన్న ఆందోళన ఆయా నాయకులను వెంటాడుతోంది.



ఖాళీగా మొత్తం పోస్టులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తి చేసుకుంది. ఇప్పుడిప్పుడే పాలనను గాడిలో పెట్టే పనిలో మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్లు, దేవస్థానం, సొసైటీల పాలకవర్గాలు, ఆసుపత్రి కమిటీలు ఇలా వైసీపీకి చెందిన నాయకులు అందరూ రాజీనామాలు చేశారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండానే జగన్ ప్రభుత్వం వైసీపీ నాయకులు, కార్యకర్తలతోనే కమిటీలతో ఐదేళ్లు గడిపేసింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పోటీ పడుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి వంటివారికి ఈ సారి రాష్ట్రస్థాయిలో పదవులు పొందే అవకాశం ఉందంటున్నారు. ఇక నియోజకవర్గాల్లోను జిల్లాస్థాయిలోను ఖాళీ అయిన పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లా స్థాయి ఆహార కమిటీలతో పాటు మండల స్థాయి కమిటీలను పాలనలో భాగంగా నియమించాల్సి ఉంది.

మార్కెట్ కమిటీలపై కన్ను

జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవుల్లో జనసేన, బీజేపీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండును తెరపైకి తీసుకువచ్చారు. ఇప్పటికే ఆయా పార్టీలు మండల, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఈ మేరకు తీర్మానాలు సైతం చేశారు. కీలకమైన మార్కెట్ కమిటీలపై కూడా కూటమి నాయకులు దృష్టి సారించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నియోజకవర్గ స్థాయిలో ఉండడం, ప్రోటోకాల్ ఉండడంతో చైర్మన్ పదవికి మంచి గిరాకీ ఏర్పడింది. జిల్లాలో కాసుల వర్షం కురిపించే మార్కెట్ కమిటీలు సైతం ఉన్నాయి. మండపేట, ఆలమూరు, రావులపాలెం, అమలాపురం, రాజోలు, రామచంద్రపురం, ముమ్మిడివరం, అంబాజీపేట, నగరం మార్కెట్ కమిటీల పదవుల కోసం ఆయా నియోజకవర్గాల్లో పార్టీల మధ్య అంతర్గత పోరు కొనసాగుతోంది. ఉదాహరణకు అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం జనసేనకు చెందిన లింగోలు పండు, చింతపల్లి చిన్నా, టీడీపీకి చెందిన అధికారి బాబ్జి పోటీ పడుతున్నారు. ఇలా ప్రతీ నియోజకవర్గంలోను ఈ తరహా పోటీ నెలకొంది. ఇక జిల్లాలోని ప్రధాన దేవస్థానాల చైర్మన్ పదవుల కోసం ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు పైరవీలు కొనసాగిస్తున్నారు. అమలాపురం ఏరియా ఆసుపత్రితో పాటు మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీలను నియమించాల్సి ఉంది. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పదవి కోసం టీడీపీకి చెందిన వలవల శివరావు, బీజేపీకి చెందిన యల్లమిల్లి నాగసుధాకొండలరావు పోటీ పడుతున్నారు. ఏది ఏమైనా నామినేటెడ్ పదవుల పోరు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు కత్తిమీద సాము కానుంది.

అర్ధరాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో

మంత్రి సుభాష్ తనిఖీలు



కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 13: మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం అర్ధరాత్రి రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంజాయి సేవించి ఆకతాయిలు అల్లరి చేస్తున్నారని, కొంతమంది అక్కడే నిద్రిస్తున్నారనే సమాచారంతో మంత్రి సుభాష్ 12.30 గంటల ప్రాంతంలో పోలీసులతో కలసి కాంప్లెక్సుకు వెళ్లారు. కాంప్లెక్సు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ అంతా సవ్యంగానే ఉండడంతో ఆయన వెనుదిరిగారు.

కలెక్టర్‌కు బీసీ ఉద్యోగ సంఘాల అభినందనలు



అమలాపురం టౌన్, జూలై 13: జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకుల బృందం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించి సత్కరించింది. జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుబ్బల మురళీకృష్ణ, కర్రి సుబ్బరాజు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు పావులూరి వెంకటగోపాలం, సరిదే సత్యపల్లంరాజు, కారాడి వెంకటనరసింహారావు, చొల్లంగి సత్యసాయిబాబా, గుబ్బల పెద్దిరాజు, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

జీపీఎస్‌కు వ్యతిరేకంగా యూటీఎఫ్ ఆందోళన

వార్త..6లో



పార్కింగ్ ప్రదేశం బురదమయం



క్యూలో భక్తుల అవస్థలు



చెప్పులు ఇలా..



బురదనీటితో దర్శనానికి వస్తూ..

సౌకర్యాలేవి?

వాడపల్లి వెంకన్న సన్నిధిలో భక్తుల అవస్థలు

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కష్టాలు తప్పడంలేదు. క్షేత్రానికి వచ్చే భక్తులు పెరుగుతున్న స్థాయిలో ఆలయంలో సౌకర్యాలు మెరుగవడం లేదు. దీంతో వేలాదిగా వచ్చే భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శనివారం రోజుల్లో భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి..

- బురదమయంగా పార్కింగ్ ప్రదేశం
- భక్తులు నడిచే దారుల్లో నిలువనీడ కరువు
- రోడ్ల మీదనే దుకాణాలు
- రాకపోకలకు అంతరాయం

ఆత్రేయపురం, జూలై 13 : రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా వాడపల్లి వెంకన్న ఆలయం బాసిల్లుతుంది. వార్షిక ఆదాయం రూ.20 నుంచి 25 కోట్లకు చేరుకుంది. డిప్యూటీ కమిషనరు హోదా దక్కినా భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవదాయ శాఖాధికారులు విఫలమయ్యారు. ప్రతి శనివారం తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది తరలివస్తారు. రాజకీయ సినీ ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు స్వామివారిని దర్శించుకుని ఏడు ప్రదక్షిణ నోము నిర్వహిస్తున్నారు. గత కొంత కాలం నుంచి ఆలయంలో పాలన గాడితప్పింది. ఆదాయం పుష్కలంగా లభిస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరిగిపోతోంది. శుక్రవారం రాత్రి స్వామి సన్నిధికి చేరుకునే భక్తులు ఆరుబయట నిద్రిస్తూ దోమల దాడిని భరించలేక పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలకు ప్రదక్షిణ నిర్వహించే భక్తులు నడుస్తూ నోమును ఆచరిస్తున్నారు. వాహనాలు పార్కింగ్ నిర్వహించే ప్రదేశం, ఏటిగట్టు కాలనీ ప్రాంతాలు బురదమయంగా మారడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. భక్తులు బురదనీటిలో వస్తూ జారిపోతున్నారు. భక్తుల సౌకర్యాలపై దృష్టిసారించకపోవడంతో పలువురు మండిపడుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి భక్తులు పడరాని పాట్లు పడ్డారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు గుడి దర్శనానికి రావడంతో సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.200 విశిష్ట దర్శనం చేసుకునే భక్తులు సుమారు ఆరు గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండటంతో సిబ్బందిపై మండిపడ్డారు. అన్నప్రసాద భవనం వద్ద భక్తులకు అరకొర సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు అందరికీ ప్రసాదం అందకపోవడంతో స్వామివారి ప్రసాదం తినకుండా వెళ్లిపోయారు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లోపించడం వల్ల పాలన గాడి తప్పడంతో వెంకన్న కొలువులో సమస్యల తిష్టవేశాయి. భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ప్రతి శనివారం జేబు దొంగలు ప్రవేశించి సెల్‌ఫోన్లు, పర్సులను దొంగలిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులు, పిల్లలు ఊపిరిఆడక స్పృహ కోల్పోతున్నారు. ఆరుబయట చెప్పులు స్టాండు కూడా లేకపోవడంతో రోడ్డు చెంతనే వ్యాపార సముదాయాల వద్ద చెప్పులు విడిచివెళ్లిపోతున్నారు. గుడి వీధులలో రోడ్లు మీదే వ్యాపారాలు ఏర్పాటు చేయడంతో భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు వచ్చేందుకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గత కొంత కాలం నుంచి గుడిలో నెలకొన్న పాలన సమస్యలపై దేవదాయ శాఖ కమిషనర్ దృష్టి సారించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. ఈ మేరకు భక్తుల నుంచి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.



రోడ్డుపై దుకాణాలు



ఎక్కువ సమయం క్యూలలో వేచి ఉన్న భక్తులు

రంప ఏరియా ఆసుపత్రికి సుస్తీ



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

- వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి ఓ రోగి మరణం, సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు
- ఆసుపత్రి వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తుల చొరబాట్లు
- మొత్తం వ్యవహారాలపై ఆరా తీసిన ఐటీడీఏ పీవో

(రంపచోడవరం):

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి మృతి, సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు, అసుపత్రి వ్యవహారాల్లో ప్రైవేటు వ్యక్తులు చొరబడటంతో వైద్యుల మధ్య వర్గపోరు వ్యవహారాలతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మునుపెన్నడూలేని వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. 100 పడకలతో మన్యం 11 మండలాలకు రిఫరల్ వైద్య కేంద్రంగా ఈ వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రి కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే....

ఇటీవల ఓ వ్యక్తి ఇక్కడ వైద్యుల నిర్లక్ష్యానికి మృతి చెందాడన్న ఆరోపణలతో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే విచారణ జరిపించారు. ఇందులో ఓ వైద్యుడి నిర్లక్ష్యం తేటతెల్లం కావడంతో తగుచర్యల కోసం ప్రాజెక్టు అధికారి వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్‌కు సిఫార్సు చేశారు. ఇదిలావుండగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే సదరం ఆరోగ్య కేంద్రం చుట్టూ అక్రమాల ఆరోపణలు చుట్టుముట్టాయి. ఇక్కడ సదరం వైద్యుడి పేరుతో ఆసుపత్రికి అనుబంధంగా పనిచేసే ఉద్యోగులు కొందరు, ప్రైవేటు వ్యక్తులు కొందరు సిండికేటుగా మారి అంగవైకల్యాన్ని ఆశించిన వారికి అనుకూలంగా ధ్రువీకరించేందుకు డబ్బులు వసూలు చేయడం ప్రహసంగా సాగింది. ఈ వ్యవహారంలో కొందరు తమ సదరం సర్టిఫికెట్ల కోసం డబ్బులను మధ్యవర్తులకు చెల్లించుకుని నేటికీ సర్టిఫికెట్లు రాక మోసపోయారు. ఇంతేకాకుండా ఆసుపత్రి పాలనా వ్యవహారాలకు సంబంధంలేని ప్రైవేటు వ్యక్తులు చొరబడి వైద్యులను కూడా శాసించే పరిస్థితికి వచ్చారు. కొందరైతే ఎమ్మెల్యేగారి తాలూకా అంటూ చెలామణి అయ్యేందుకు ప్రయత్నించి ఆసుపత్రిపై పట్టు సాధించాలని చూస్తున్నారు. అటువంటి వారిని పసిగట్టిన ఎమ్మెల్యేగారి శిబిరం సదరు వ్యక్తులను దూరం పెట్టినట్టు తెలిసింది. ఇదే తరుణంలో ఆసుపత్రిలోని వైద్యులు గ్రూపులుగా విడిపోయి, వర్గపోరును కొనసాగిస్తున్నారు. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించడం కూడా వైద్యులు మానేశారు. కొన్ని సందర్భాలలో స్టాఫ్ నర్సులే రోగులను ఆదుకునే పరిస్థితి నెలకొంది. డ్యూటీలో ఉండాల్సిన డ్యూటీ వైద్యులు అత్యవసర కేసులు వచ్చాయని నర్సులు పిలిస్తేగానీ రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

సరైన వైద్య సేవలు అందడంలేదు

ఇదిలావుండగా సాధారణ రోగులు సైతం వైద్యుల మధ్య వర్గపోరు కారణంగా సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించడం లేదా గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రదీప్ అనే వైద్యుడు అందించే సేవలు కోసం అక్కడకు వెళ్లిపోతున్నారు.

ఫిర్యాదులతో కాలయాపన

దీంతో ఒకరిపై ఒకరు నిమాను కొనసాగిస్తూ లోపాలను వెతుకుతూ ఎవరిదారిలో వారు తమకు ఉన్న పరిచయాలతో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఒకరుపై ఒకరు చేసుకుంటు న్న ఫిర్యాదులు ఇటు అధికార వర్గాల నుంచీ, అటు ప్రజాప్రతినిధుల నుంచి సంబంధిత వైద్య విధాన పరిషత్ అధికారులకు చేరుతున్నాయి. వ్యవహారంపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టి సారించడంతో ఇప్పటికే బాధ్యులపై తగు చర్యలకు రంగం సిద్ధమవుతోంది.



కొండలపై తెల్లటి మేఘాలు

అల్లూరిజిల్లా దేవీపట్నం మండలంలోని ఇందుకూరు-1 ఏనుగులగూడెం ఆర్ అండ్‌ఆర్ కాలనీ సమీపంలో గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కొండలపై తెల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. ఈ ప్రకృతి సోయగం చూస్తే ఊటీని తలపిస్తున్నట్లు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. - దేవీపట్నం

భక్తవత్సల గోవింద గోవిందా...

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.43.25 లక్షలు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి



స్వామివారిని దర్శించుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ఆత్రేయపురం, జూలై 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తూర్పుగోదావరిజిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. వివిధసేవలద్వారా స్వామివారి ఒక్క రోజు ఆదాయం రూ.43.25లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూలై 13: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారు జామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,56,900 అన్నదాన విరాళాలు రూ.52,361 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,600 తులాభారం రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా 30,060, వెరసి రూ.3,46,171 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారా యణాచార్యులు పాల్గొన్నారు.



శృంగారవల్లభస్వామి

పోలవరం లోపాలపై హైకోర్టులో పిల్

- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: పోలవరం ప్రాజెక్టు లోపభూయిష్టంకాదని ప్రభుత్వం చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సవాల్ చేశారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లు మారిపోతున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చాలా లోపాలు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు ఎంత ఖర్చు పెట్టారు.. ఇంకా ఎంత ఖర్చవుతుందనే విషయాలు ప్రస్తావించలేదన్నారు. లోపాలపై అన్ని వివరాలతో హైకోర్టులో పిల్ వేస్తున్నానని చెప్పారు. సమావేశంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సేవకు వాయిద్య పరికరాల అందజేత

అన్నవరం, జూలై 13: సత్యదేవుడి సన్నిధిలో నిర్వహించే వివిధ ఆర్జితసేవలలో వాయించే మంగళధ్వనులకు అవసరమయ్యే డోలు, సన్నాయిలను విజయవాడకు చెందిన శనగశెట్టి జగదీష్ దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించారు.



దేవీపట్నంలో లభించిన పుట్టగొడుగులు

అందుబాటులోకి పుట్టగొడులు

దేవీపట్నం, జూలై 13: ప్రతీఏటా జూలై, ఆగస్టు నెలలో అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు లభ్యమయ్యే పుట్టగొడులు ఈఏడాది అందుబాటులోకి వచ్చాయి. కేవలం ఈరెండు నెలల్లో మాత్రమే అతి తక్కువగా లభ్యమవుతుంటాయి. మాంసకృతులు, ప్రొటీన్లు పుష్కలంగా ఉండడంతో వీటికి ఎంతో డిమాండ్ ఉంది.

అంతర్వేది తీరంలో బోటు మునక

- సురక్షితంగా బయటపడ్డ 9మంది మత్స్యకారులు





అంతర్వేది బీచ్‌లో బోటు మునిగినపోతున్న బోటు, అనంతరం ఒడ్డుకు చేరి మత్స్యకారులు

అంతర్వేది, జూలై 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం సముద్రంలో ఇసుక మేటలు తగిలి కాకినాడ జిల్లాకు చెందిన సోనా బోటు శనివారం ఉదయం సముద్రంలో మునిగిపోయింది. బోటులో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. కాకినాడ నుంచి నాలుగు బోట్లలో మత్స్యకారులు శనివారం ఉదయం వేటాడుతూ అంతర్వేది వైపు వస్తున్నారు. అంతర్వేది సాగరసంగమం సముద్రంలో ఇసుక మేటలు తగలడంతో ఒక బోటు సముద్రంలో నిలిచిపోయింది. ఇసుక మేటలు తగలడంవల్ల బోటుకున్న చెక్క విరిగింది. దీంతో బోటు లోపలికి నీరు ప్రవేశించింది. దీంతో బోటు మెల్లగా సముద్రంలో మునిగిపోయింది. వేటాడుతూ వస్తున్న వేరే బోటు సహాయంతో తొమ్మిది మంది మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు.మునిగి పోతున్న బోటు వద్దకు వెళ్లి వలలు, వేటాడిన చేపలను తీసుకు రావడానికి స్థానిక పల్లిపాలెంలో ఉన్న చిన్నబోటు సహాయంతో స్థానిక మత్స్యకారులు, సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు వెళ్లే ప్రయత్నం చేశారు. అలలు ఉధృతంగా ఉండడంతో వారు వెనుతిరిగారు. మునిగిపోయిన బోటులో వలలు, వేటాడిన చేపలు ఉన్నాయి. రూ.20లక్షల నష్టం ఏర్పడిందని బోటు నిర్వాహకుడు వీరబాబు తెలిపాడు. కాకినాడకు చెందిన కొప్పాలి ధన బోటు యజమానిగా స్థానిక మత్స్యకారులు గుర్తించారు. కామాడి తాతారావు, కామాడి గోవిందు, బొడ్డు తాతారావు, బొడ్డు కృష్ణమూర్తి, కర్రి సత్యనారాయణ, కర్రి అప్పారావు, మరో ముగ్గురు మత్స్యకారులు బోటు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

కళారంగం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులవ్వాలి

- సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్

పోర్టు సిటీ (కాకినాడ), జులై 13: కళారంగం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులవ్వాలని కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురళీధర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు పురస్కరించుకుని మూడోరోజు శనివారంరాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పైవిధంగా వ్యాఖ్యానించారు. ఆత్మీయఅతిథిగా పాల్గొన్న ప్రణవ ఆశ్రమం మాతాజీ సుమిత్రానంద సరస్వతి మాట్లాడుతూ భారతీయ కళలవైపు ప్రపంచ దేశాలు చూస్తుండటం, మన దేశానికే గర్వకారణమని చెప్పారు. అనంతరం సలాది వీర వెంకటసత్యనారాయణమూర్తికి ఆంధ్ర ఆవార్డు బహూకరించారు. ఈ కార్యక్రమానికి తొలుత నిర్వహించిన ఏకపాత్రాభినయ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అందరినీ ఆలోచింప చేసిన మూల్యం నాటిక..

గోవాడ క్రియేషన్స్ హైదరబాద్ ఆధ్వర్యంలో సింహప్రసాద్ రచన, డాక్టర గోవాడ వెంకట్ దర్శకత్వంలో ప్రదర్శించిన మూల్యం నాటిక అందరినీ ఆలోచింప చేసింది. నేటి సమాజంలో ఆడపిల్లలపై పెడుతున్న ఆంక్షలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ప్రదర్శన కొనసాగింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా ఒక వివాహిత మహిళ ఏ విధంగా హక్కులను సాధించింది నాటిక రూపంలో ప్రదర్శించారు. అదేవిధంగా కరీంనగర్ చైతన్య భారతి సంస్థ ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించారు. నాటికకు మూలకథ పీఎస్ నారాయణ అందించగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కర్రి అచ్చుతరామారెడ్డి, పంపన దయానందబాబు, జాతీయ అల్లూరి యువజన సేవఆ సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, గౌరవ సలహాదారులు గట్టి సత్యనారాయణ, రాయప్రోలు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యకళామందిర్‌లో ఎస్‌వీఎస్‌వీవీఎస్ మూర్తికి ఆంధ్రశ్రీ అవార్డు అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలులో విజిలెన్స్ తనిఖీలు

- రూ.20.42లక్షలు విలువైన రేషన్ బియ్యం స్వాధీనం
- క్రిమినల్ కేసులు నమోదు



గొల్లప్రోలులో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన రేషన్‌బియ్యం లారీ

గొల్లప్రోలు, జూలై 13: కాకినాడజిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రేషన్‌బియ్యం లారీలో తరలిపోతున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా పట్టణ శివారులో తనిఖీలు చేపట్టారు. లారీని తనిఖీ చేయగా 458 బస్తాల్లో ఉన్న 229 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రూ. 20.42లక్షలు విలువైన ఈ రేషన్‌బియ్యాన్ని, లారీని సీజ్ చేశారు. దుర్గాడ గ్రామానికి చెందిన ఉమ్మిడి కృష్ణకిరణ్, గొల్లపల్లి శ్రీనివాసరావులు ఈ రేషన్‌బియ్యాన్ని చత్తీస్‌ఘడ్ తరలిస్తున్నట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పౌరసరఫరాలశాఖ ద్వారా 6ఏ కేసు నమోదుచేసి బియ్యం, లారీ నిల్వలు స్వాధీనం చేయడంతోపాటు రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో ఎవరైనా రేషన్ బియ్యం కొనడం, అమ్మడం చేసినా, నిల్వలు ఉంచినా, రవాణాకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, ఏవో బార్గవమహేష్, పీసీలు వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఓఎస్‌డీ బదిలీ



ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి

చింతూరు, జూలై 13: రంపచోడవరం ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ క్రమంలో బదిలీతోపాటు పదోన్నతిని పొందిన మహేశ్వరరెడ్డి శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా బాధ్యత లు చేపట్టనున్నారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్వరరెడ్డి మొదటి పోస్టింగ్‌లో భాగంగా 2022 ఆగస్టు22న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి 2023 ఏప్రిల్ 30 వరకు ఆయన ఏఎస్పీగా ఉన్నారు. అనంతరం ఆయనకు రంపచోడవరం ఓఎస్‌డీగా బాధ్యతలు అప్పగించారు.

ప్రాజెక్టులకు జలకళ



ఎటపాక: జలకళను సంతరించుకున్న అలుగు ప్రాజెక్టు





ఇందుకూరుపేట వద్ద పొంగిన ఇనుకొండ వాగు, చెరువు నీరు బయటకు పోతున్న దృశ్యం

- పొంగుతున్న వాగులు, వంకలు
- స్తంభించిన జనజీవనం
- భారీ వర్షాలతో పోటెత్తుతున్న వరదనీరు

దేవీపట్నం, జూలై 13: అల్పపీడనం ప్రభావంతో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు అల్లూరిజిల్లా దేవీపట్నం మండలంలో ఇను కొండ, సీతపల్లి, ఫజుల్లాబాద్ తదితర వాగులు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. ఎక్కడి ప్రజలు అక్కడే ఉండిపోవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. చాలావరకు ప్రజ లు తమ ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. ఇందుకూరు గ్రామ శివారున రైతు ముచ్చు నాగేశ్వరరావు చెరువులోకి అధిక మొత్తంలో వర్షపునీరు చేరడంతో చెరువులోని చేపలు తరలిపోయాయి. దీంతో లక్షల్లో నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెబుతున్నాడు.

నిండిన అలుగువాగు ప్రాజెక్టు

ఎటపాక, జూలై 13: అల్లూరి జిల్లా ఎటపాక మండ లం అచ్యుతాపురం గ్రామంవద్ద ఉన్న అలుగువాగు ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. గత ఐదారు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతోపాటు ప్రాజె క్టు ఎగువన భారీ వర్షాలు పడడంతో వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దాంతో ప్రాజెక్టు నిండి వరదనీరంతా పొంగిపొర్లుతోంది. వరద ప్రవాహం ప్రాజెక్టు దిగువకు ప్రవహిస్తోంది. వరద నీరంతా ప్రవహిస్తూ ఉండడంతో స్థానిక గిరిజనులు జోరుగా చేపలను వేటాడుతున్నారు.

పురుగులమందు కలిసిన నీళ్లు తాగిన
12 మంది కూలీలకు అస్వస్థత

- వడ్డిపాలెం చెరువుల వద్ద ఘటన
- క్షతగాత్రులు పశ్చిమ బెంగాల్ వాసులు



కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

కరప, జూలై 13: ప్రమాదవశాత్తూ పురుగులమందు కలిసిన నీటిని తాగి 12మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారిగా గుర్తించారు. స్థానికంగా సంచలనమైన ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా కరప పోలీసులు విఫలయత్నంచేయడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం యండమూరు శివారు వడ్డిపాలెంలో కిరణ్‌రాజు అనే వ్యక్తి ఆక్వా చెరువులను సాగుచేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన 12మంది కూలీలు 15రోజుల క్రితం ఇక్కడకు వచ్చి చెరువులవద్ద పనులు చక్కబెడుతున్నారు. శనివారం ఉదయం కూలీలు తమ పని ముగించుకుని వాటర్ టిన్నులోని నీరు తాగి ఒక్కసారిగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన షేక్ సలీం, అజీద్, నూరుద్దీన్, అమనుల్లా, ఫరూఖ్, కలిపటిముండ్, ప్రాడాస్, సాంతూల్, ఫైజల్, అన్వర్, సలుద్దీన్, అమీనుద్దీన్‌లు విషతుల్యమైన నీటిని తాగినట్టుగా గుర్తించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. పురుగులమందు కలిసిన నీటిని తాగడంవల్లనే ఇలా జరిగిందని ప్రాథమికంగా గుర్తించారు. చెరువుల యజమాని ఫిర్యాదు మేరకు కరప పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ ఘటనకు కారణాలను పోలీసులు అన్వేసిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం పిచికారీ చేసిన గడ్డిమందు ప్రభావంవల్ల వాటర్ టిన్నుల్లో తాగునీరు విషపూరితమైనట్టుగా భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎంకే సౌజన్య కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వా రి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

సరిగ్గా చదవలేదని కొట్టారు!

- మంచానికే పరిమితమైన విద్యార్థిని
- గురుకుల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పిఠాపురం, జూలై 13: సరిగ్గా చదవలేదని కొట్టడంతో గురుకుల పాఠశాల విద్యార్థిని మంచానికే పరిమితమైన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు బాధ్యులపై గురుకుల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన నురుకుర్తి అమృత పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నది. పాఠ్యాంశాలు చదవడం లేదంటూ అమృతను ఉపాధ్యాయులు కర్రతో విచక్షణా రహితంగా కొట్టారని, 24గంటలు పాటు గదిలో నిర్బంధించారని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. నడుము, వెన్నుముఖ, తల, శరీరంపై బలమైన గాయాలు కావడంతో అమృత స్పృహ కోల్పోయిందని, కొందరు ఉపాధ్యాయులు ఆసుపత్రిలో చేర్చి చేతులు దులుపుకున్నారు. డిసెంబరు నెలలో ఈ సంఘటన జరగ్గా అప్పటి నుంచి తాము ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా తమ కుమార్తె అమృత కోలుకోలేదని తల్లిదండ్రులు తెలిపారు. చికిత్స చేయించేందుకు తమ వద్ద ఉన్న సొమ్ముతో కాలనీ వాసులు ఇచ్చిన డబ్బుతో చికిత్స చేయించామని చెప్పారు. తమ కుమార్తె మంచానికే పరిమితమైందని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాము ప్రిన్సిపాల్, పీఈటీలను ప్రశ్నించి ఫిర్యాదు చేయడానికి గురుకుల పాఠశాలకు వస్తే లోపలకు కూడా అనుమతించడంలేదని తెలిపారు. అక్కడ బంధువులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తాము మానసిక క్షోభను అనుభవిస్తున్నామని, బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. తాము ఏ విద్యార్థినిని కొట్టలేదని, ఏప్రిల్ వరకూ పాఠశాలకు వచ్చిందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ త్రివేణి తెలిపారు. వేసవి సెలవులు తర్వాత సదరు విద్యార్థిని రాకపోవడంతో తాము అడిగామని, అందుకే ఈ విధంగా చెబుతున్నారని చెప్పారు.

అవినీతిపై చర్యలు అభినందనీయం

రాయవరం,జూలై13:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పౌరసరఫరాల శాఖలోఉన్న అవినీతిని మంత్రి నాదెండ్ల మనోహర్ వెలికి తీయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ వీవీవీచౌదరి అన్నారు. కూర్మాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రబీ ధాన్యం బకాయిలు రూ.170కోట్లు విడుదలకు చర్యలు తీసుకోవాలని మంత్రికి లేఖ రాసినట్టు ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారని, ధాన్యం బకాయిలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు.

- గడియార స్తంభం సెంటర్‌లో యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా
- పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

జీపీఎస్ అమలుచేస్తూ రాజపత్రం విడుదల దుర్మార్గం

అమలాపురంటౌన్, జూలై13: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలుచేస్తూ రాజపత్రం విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుకుంటుంటే అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం జీపీఎస్ అమలు చేస్తానని ప్రకటించిందన్నారు. పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా నిలుపుదల చేసిన జీపీఎస్ అమలు రాజపత్రాన్ని విడుదల చేయడాన్ని నిరసిస్తూ శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత ఏడాది అక్టోబరు నుంచి సీపీఎస్ ఉద్యోగులను జీపీఎస్‌లోకి మారుస్తూ రాజపత్రం విడుదలచేయడం, ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనని విమర్శించారు. పాత తేదీతో విడుదల చేసిన రాజపత్రాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటీవీఏఎస్ సుబ్బారావు డిమాండ్‌చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వంఇచ్చిన మెమో 57ను అమలుచేసి 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు తిరిగి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. రాజపత్రం ప్రతులను గడియార స్తంభం సెంటర్‌లో దహనంచేశారు. జీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనినినాదాలతో హోరెత్తించారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు బేతినీడి శ్రీనివాసరావు, కోశాధికారి కేశవరాజు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, పి.మురుగేశ్వరరావు, కె.శ్రీనివాస్, అడబాల కాశీ, చంద్రకళ, వి.రత్నం, బీఎస్ వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రాజపత్రం ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరణకు చర్యలు



ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘాలు

ముమ్మిడివరం, జూలై 13: బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆకొండి రామకృష్ణ అధ్యక్షతన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును ఘనంగా సత్కరించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ గజమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి పండిత ఆశీర్వచనాన్ని అందించారు. దీనికి ముందు దాట్ల సుబ్బరాజు ఉమాసూరేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం జరిగిన సన్మాన సభలో ఎమ్మెల్యే బుచ్చిబాబు మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.230 కోట్లతో బ్రాహ్మణులకు ఆర్థికచేయూత అందించారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరణకు కృషి చేస్తానని, బ్రాహ్మణుల సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తమ గెలుపుకు కృషిచేసిన బ్రాహ్మణ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణులను అన్నివిధాలా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ఆదిశైవ సంఘ అధ్యక్షుడు యనమండ్ర రాంబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఆకొండి మహేష్, ఎం.సోమయాజులు, నాగాభట్ల బుజ్జి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల పృథ్వీరాజ్, దాట్ల బాబు, నడిమింటి సూర్యప్రభాకరం, నాగాభట్ల రవిశర్మ, ఆకొండి ఉమామహేష్, యనమండ్ర సీతారామశాస్త్రి, నాగాభట్ల సుబ్రహ్మణ్యం, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపీ, చింతలపూడి కొండబాబు, కుంచనపల్లి నారాయణ, కాశి లాజర్, కురసాల శివబాబు, కాకి సుబ్రహ్మణ్యం, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, నాలుగు మండలాల అర్చక, పురోహిత, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు జీపీఎస్ నోటిఫికేషన్



ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొరబాబు, పల్లంరాజు

అమలాపురం టౌన్, జూలై 13: పాత పెన్షన్ విధానానికి బదులుగా గత వైసీపీ ప్రభుత్వం గ్యారంటీ పెన్షన్ స్కీమును ప్రవేశపెట్టడాన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు శనివారం పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం జీపీఎస్‌పై 2023 అక్టోబరుల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి చట్టం చేసిందన్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం కొలువుతీరి పాలనను గాడిలో పెట్టే పనిలో ఉండగా ప్రస్తుత ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే దురుద్దేశంతో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈఏడాది జూన్12న సెలవుపై వెళ్తూ హడావిడిగా జీపీఎస్ జీవో 54ను విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈవిషయాన్ని తీసుకువెళ్లకుండానే పాత జీవోకు అనుగుణంగా గెజిట్‌ను విడుదల చేయడం దారుణమన్నారు. పైగా జీపీఎస్ 2023 నుంచి అమలులో ఉన్నట్టు జీవో విడుదల చేయడాన్ని ఎస్టీయూ జిల్లాశాఖ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. దీనిపై త్వరలో రాష్ట్ర సంఘ పిలుపుతో కార్యాచరణ ప్రకటిస్తామనితెలిపారు.

త్యాగరాజ గానసభ నిర్మాణ పనులు పునఃప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 13: రామచంద్రపురం పట్టణంలో త్యాగరాజగాన సభ నిర్మాణానికి గ్రహణం వీడింది. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ శనివారం త్యాగరాజ గానసభ నిర్మాణ పనులు పునఃప్రారంభించారు. గత టీడీపీ హయాంలో సాంస్కృతిక శాఖ నుంచి మొదటి విడతగా రూ.25లక్షలు, రెండో విడతగా రూ.20లక్షలు మంజూరు చేశారు. 2019మార్చిలో టెండర్లు ఖరారుచేసి పనులు ప్రారంభించారు. మొదటి మంజూరైన రూ.25లక్షలకు పనులు పూర్తిచేశారు. రూ.25లక్షలకు బిల్లులు వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించగా 2024 మార్చిలో కాంట్రాక్టరుకు బిల్లు చెల్లించారు. అప్పట్లో మంజూరుచేసిన రూ.20లక్షలు గ్రాంటును వైసీపీ ప్రభుత్వం విడుదల చేయలేదు. ఈనేపథ్యంలో ఎంపీ బోస్ ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.20లక్షలు 2023 డిసెంబరులో మంజూరుచేశారు. శనివారం మళ్లీ త్యాగరాజ గానసభ పనులు పునఃప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, టీడీపీ నాయకులు గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, కడియాల రాఘవన్, నందూరు ఫణికుమార్, అల్లం శ్రీనివాస్, లయన్ జీవిరావు, కౌన్సిలరు వాడ్రేవు సాయిప్రసాద్, ట్రస్టు కార్యదర్శి తటవర్తి శ్రీనివాస్, శ్రీహరి పంతులు, విల్లూరి కృష్ణానందమూర్తి, కార్యదర్శి ఆరాది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గానసభ పనులు ప్రారంభం సందర్భంగా నాయకులకు సన్మానం

ఇద్దరికి రూ.70వేలు మంత్రి సుభాష్ సాయం



శ్రీనివాస్ కుటుంబానికి రూ.50వేలు అందిస్తున్న మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 13: రామచంద్రపురం పట్టణంలో ఇద్దరు కుటుంబాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.70 వేలు అందజేశారు. స్థానిక గుళ్లవారిపేటకు చెందిన చిట్టూరి శ్రీనివాస్ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆ కుటుంబానికి మంత్రి సుభాష్ శనివారం రూ.50వేలు అందజేశారు. భర్త ఆదరణ కరువైన 24వ వార్డుకు చెందిన కోటిపల్లి జ్యోతికి రూ.20వేలు మంత్రి అందించారు. ప్రతీనెల కొంత మొత్తం ఆర్థిక సాయం అందజేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు మేడిశెట్టి శేషారావు, కొసనా శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గురుపూజోత్సవం

రాయవరం,జూలై13: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వెదురుపాకలో గీతా మం దిరంలో ఆదివారం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్టు అంగర జనార్ధనాచార్యులు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, జూలై 13: వల్లూరులో కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, గూడూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బొల్లినేని కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక కాకతీయ కమ్యూనిటీ కిచెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు, నెక్కంటి శ్రీరాంజీ ప్రారంభించారు. బీపీ, షుగర్ పరీక్షలు, జనరల్‌బాడీ చెకప్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్మసంఘం పెద్దలు పుట్టా సత్యనారాయణ, గజ్జరపు కల్యాణ్, గెడ శ్రీనివాస్, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్‌కు చెందిన గూడూరు సత్యనారాయణ, కమ్మ బ్రహ్మాజీ, శివశంకర్, వినయ్ పాల్గొన్నారు.

ఘనంగా చిన్నారి తులాభారం

కపిలేశ్వరపురం, జూలై13: అంగరలో శ్రీఅలివేలు మంగ గోదాదేవి సమేత శ్రీవైభవవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో మాచరమట్లలు గ్రామానికి చెందిన రాంబాబు, సత్యవతి దంపతుల మనవడు హెయాన్స్ పార్దేవ్‌కు నాణేలతో తులాభారం నిర్వహించి స్వామికి మొక్కు చెల్లించారు. చిన్నారి కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాల్వపూడిక తీత పనులు పరిశీలన



పూడి తీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 13: వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి నాశనం చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. పంట కాల్వల ఆధునికీకరణ, మరమ్మతులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పట్టణంలోని రామచంద్రుడు డెడికేటెడ్ చానల్‌లో స్థానిక గొల్లపుంతకాలనీకి వెళ్లే దారిలో జరుగుతున్న పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను రైతులతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల పరిశీలించారు. మాజీ కౌన్సిలర్ సిద్దిరెడ్డి రామన్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం

మామిడికుదురు, జూలై13: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా దువ్వ గ్రామానికి చెందిన వాసంశెట్టి శివనాగరాజు-అనసూయ దంపతులు రూ.50,116, విజయవాడకు చెందిన ఎం.రామకృష్ణ-అంజలి దంపతులు రూ.10వేలు ఇచ్చారు.

ఎమ్మెల్యే దేవ జన్మదిన వేడుకలు

మలికిపురం, జూలై 13: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని కూటమి నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వీర మహిళలు ఎమ్మెల్యేను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇమామ్ హుస్సేన్ తనయుడికి ఘన నివాళి

మామిడికుదురు, జూలై 13: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు షహజాదే ఖాశింకు ముస్లిం భక్తులు ఘన నివాళులర్పించారు. మొహర్రం నెలలో ఏడో రోజు శనివారం గుర్రాలపై పీర్లను ఊరేగించారు. కర్బలా పుణ్యభూమిలో షహజాదె ఖాశింపై జరిగిన అమానుష చర్యను మత ప్రబోధకుడు మహ్మద్‌అలీ జాఫరీ భక్తులకు వివరించగా ఆ సంఘటన విని భక్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజా, నగరంలోని షహజాదె ఖాశిం పంజాలో ఈసందర్భంగా మజ్లిస్‌లు జరిగాయి. అనంతరం ఆయా పంజాల నుంచి పీర్లు, గుమ్మటాలను ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



షహజాదే ఖాశింకు నివాళులర్పిస్తున్న మజ్లిస్ ఆలపిస్తున్న భక్తులు

దుర్వాసన నుంచి విముక్తి కలిగించండి!



మొండెపులంకలాకు సమీపంలో వంతెన వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పి.గన్నవరం, జూలై 13: వంతెన వద్ద పేరుకుపోయిన వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. మొండెపులంక లాకులు సమీపంలో ప్రధాన పంట కాల్వపై ఉన్న రెండు వంతెనల వద్ద పిల్లర్లకు ప్లాస్టిక్ వ్యర్థాలు, తూటు, జంతు కళేబరాలు అడ్డుపడి సాగునీరుకు అడ్డంకిగా మారింది. అలాగే వాటి నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల లంకలగన్నవరం శివారు లంకగ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే వంతెన వద్ద వ్యర్థాలు పేరుకుపోవడంతో కొత్తపేట ఆర్డీవో వాటిని దగ్గరుండి తొలగింప చేశారు. ప్రధాన పంటకాల్వలపై ఉన్న రెండు వరుస వంతెనలు వద్ద తూడు, వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆర్డీవో ఆదేశాలను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించిన ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక





అంతర్వేది: పూర్వ విద్యార్థుల సమ్మేళనం మలికిపురం: పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అంతర్వేది, జూలై13: సఖినేటిపల్లి లూథరన్ హైస్కూలులో 1988లో చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. యోగ క్షేమాలు తెలుసుకుని, అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, ఉపాధ్యాయులను సన్మానించారు. నల్లి ప్రేమానందం, విజయరత్నం, సువర్ణరత్నం, జాన్‌మేజెష్ పాల్గొన్నారు.

మలికిపురం: లక్కవరం సెవెంత్‌డే అడ్వంటిస్ట్ స్కూలులో 1999లో విద్యాభ్యాసం చేసిన వారంతా శనివారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో, ఎస్టీయే క్యాంపస్‌లో కలుసుకున్నారు. పూర్వవిద్యార్థులు కుటుంబాలతో వచ్చి తీయని జ్ఞాపకాలను తలచుకుని కొత్త అనుభూతులు పొందారు. ప్రధాన అతిథి మిస్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సమాజంలో సానుకూల ప్రభావాలను కొనసాగించాలన్నారు.

వంటగ్యాస్ లీకు: ఇద్దరికి గాయాలు

అంబాజీపేట, జూలై 13: పుల్లేటికుర్రు పరిధి పల్లపువీధిలో ఒక ఇంట్లో గ్యాస్ లీకేజీ కావడంతో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన అందే వీరభద్రుడు డాబా పోర్షన్‌లో నివ సిస్తున్నాడు. శనివారం సాయంత్రం వీరభద్రుడు భార్య విజ యలక్ష్మి గ్యాస్ స్టౌ వెలిగించింది. గ్యాస్ లీకై పెద్దగా మంటలు వ్యాపించి విజయలక్ష్మికి ఇంటి సమీపంలోని యువకుడు అందే హేమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. చేనేత మగ్గం, దుస్తులు, సామగ్రి, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఉపసర్పంచ్ వీరా రవి, కూటమి శ్రేణులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా దెందులూరి



కొత్తపేట నూతన బ్రాహ్మణ సంఘం కార్యవర్గం

కొత్తపేట, జూలై 13: కొత్తపేట బ్రాహ్మణ సంఘ అధ్యక్షునిగా దెందులూరి జగదీశ్వర ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గాయత్రి పరమేశ్వర బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం కీర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అజ్జరపు సుబ్బారావు, కోశాధికారిగా కీర్తి వీరవెంకట సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా వేమవరపు రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చావలి సుబ్బరాయశాస్త్రి, కార్యవర్గ సభ్యులుగా కందుకూరి మురళీధర్, సత్యవాడ సందీప్, ఆచంట విద్యాసాగర్, తట్టమట్ట రవి, కడియాల వీరవెంకట సత్యనారాయణరావు, తనికెళ్ల శాస్త్రులు ఉన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కీర్తి వెంకటేశ్వరరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, కాకరపర్తి బంగారుబాబు, వేమవరపు మురళీ, అయ్యగారి కృష్ణ, కొంపెల్ల శర్మ, నడిమింటి కృష్ణారావు పాల్గొన్నారు.

రోటరీ సమావేశం

మలికిపురం, జూలై 13: మలికిపురం రోటరీ క్లబ్ సమావేశం శనివారం పూలే-అంబేడ్కర్ భవనంలో జరిగింది. నూతన అధ్యక్షురాలిగా విశ్రాంత తహసీల్దార్ బత్తుల ఝాన్సీబాయి, కార్యదర్శిగా మట్టా రవికుమార్, కోశాధికారిగా తోలేటి సతీష్ ఎన్నికైనట్టు తెలిపారు. గత సంవత్సరం చేసిన సేవా కార్యక్రమాలకు మలికిపురం రోటరీ క్లబ్‌కు రెండు అవార్డులు సాధించుకున్నట్టు సమావేశంలో తెలిపారు. ఈ నెల24న నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, ఎస్.మురళీకృష్ణ, బందెల సంపత్‌కుమార్, గుబ్బల బాబ్జి, గెడ్డం తులిప్‌రాజు, రాపాక విజయారావు, అల్లూరి మధురామరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఓంజీ
శ్రీలలిత	: సారంగ దరియా
శేఖర్ స్క్రీన్-1	: కల్కి
శేఖర్ స్క్రీన్-2	: ---
రమా	: భారతీయుడు 2
గణపతి	: రౌడీ గ్యాంగ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ---

పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ

మామిడికుదురు, జూలై 13: మొగలికుదురు గ్రామంలో రోడ్లు, డ్రెయిన్ పనులు నిర్వహించకుండా పనులు చేపట్టినట్టు రూ.40లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్టు ఉపసర్పంచ్ గనసాల దీపిక, వార్డు సభ్యులు పంచాయతీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామసర్పంచ్, కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఈవ్యవహారంపై ఈనెల16న విచారణ నిర్వహిస్తామని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు తెలిపారు. ఈవ్యవహారంపై ఈనెల12న డీఎల్పీవో విచారణకు రాగా పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్ విధులకు గైర్హాజరు కావడంతో స్థానిక పెద్దలతో కలిసి ఈనెల16న విచారణ నిర్వహిస్తామని డీఎల్పీవో ప్రకటించారు.

నేడు శాకంబరి అలంకరణలో గుర్రాలక్కమ్మ

అంతర్వేది, జూలై 13: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అనుబంధ దేవాలయం, సోదరి గుర్రాలక్కమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా విశేష అలంకారం చేయనున్నారు. ఆషాఢ మాసం సందర్భంగా గుర్రాలక్కమ్మ(అశ్వరుడంబిక) అమ్మవార్ని శాకంబరిగా పూజిస్తే అన్ని జీవరాశులకు, మనుషులకు ఆహారం సమృద్ధిగా పండి, జనులందరూ సుభిక్షంగా ఉంటారని, ఆయురారోగ్యాలు కలుగుతాయని అర్చకులు చెప్పారు. గ్రీష్మ రుతువుతో అధిక వేడి నుంచి వర్ష రుతువులోకి మారడంతో ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని తగ్గించి మానవులందరినీ కాపాడేందుకు ఆ జగన్మాత శాకంబరిగా అవతరించి మనుషులు, పశు పక్ష్యాదులను కాపాడుతుందని దేవీ భాగవత మహాత్యం, మార్కండేయ పురాణంలో చెప్పబడిందని అర్చకులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి జరగబోయే ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

కృత్రిమ పళ్లు అమరికపై అవగాహన

అమలాపురం టౌన్, జూలై 13: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కృత్రిమ పళ్లు అమరికపై అమలాపురం కిమ్స్ దంత వైద్య కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన డిజిటల్ గైడెడ్ ఇంప్లాంట్ సర్జరీ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కృత్రిమ పళ్లు అమర్చే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డాక్టర్ విశాల్‌సింగ్, డాక్టర్ జగత్‌రెడ్డి వివరించారు. లైవ్ సర్జికల్ డెమోను నిర్వహించారు. దంత వైద్య అనుభవాలను విశాల్‌సింగ్ వివరించారు. కిమ్స్ ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, కె.శేషపవిత్ర, రాజశ్యామల, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివకుమార్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 150మంది దంత వైద్యులు శిక్షణలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విశాల్ సింగ్‌ను సత్కరించారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదలపై హర్షం

అమలాపురం రూరల్, జూలై 13: 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు విడుదల చేసినందుకు సర్పంచ్‌ల సమాఖ్య అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామచంద్రరావు(రాము), సర్పంచ్ పెనుమాల సునీత హర్షం ప్రకటించారు. నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీల పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలుపుకుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు రూ.250 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన వేట కోట్ల నిధులను పంచాయతీలకు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట, జూలై 13: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. శనివారం కొత్తపేట సలాది స్వామినాయుడు జ్ఞాపకార్థం వారి తనయుడు సలాది రామకృష్ణ ఆధ్వర్యంలో ఆక్యూపైజర్ హెల్త్‌కేర్ సౌజన్యంతో కొత్తపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎమ్మెల్యే సత్యానందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ధర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి జయలక్ష్మీభాస్కరరావు, సలాది రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్ టి.బాలాజీ పాల్గొన్నారు.

సద్దుమణిగిన జనసైనికుల వివాదం



జనసైనికులతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూలై 13: రాజోలు నియోజకవర్గానికి చెందిన జన సైనికులు రెండు వర్గాలుగా రాజోలులో శుక్రవారం ఘర్షణ పడిన విషయం విదితమే. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు పోలీసు కేసులు పెట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కల్పించుకుని ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చారు. ఎమ్మెల్యే సమక్షంలో పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, ఎన్నారై వెంకటపతిరాజులు అవగాహనా లోపంతో సమస్యలు ఏర్పడ్డాయని విచారణ వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కావని, పార్టీ కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వెంట ఉంటామని, ఎమ్మెల్యే సూచనలతో ప్రతీ కార్యక్రమంలో పాల్గొంటామని వారు అన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ అధినేత లింగోలు పెద్దబ్బులు, రాజోలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, రావూరి నాగు, రావూరి సత్తిబాబు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన ఉద్యోగులు



మంత్రి సుభాష్‌ను కలసిన ఎన్‌జీవో అసోసియేషన్‌నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 13: జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉద్యోగసంఘ నాయకులు శనివారం మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాలూకా యూనిట్ భవనానికి స్థలం ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన రాయితీలను మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి మద్దాల బాపూజీ, ఎన్‌జీవో అధ్యక్షుడు చిక్కాల సూర్యారావు, కె.సూర్యకుమారి, ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి ఎం.కాశీవిశ్వేశ్వరరావు జేఏసీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మంత్రి సుభాష్‌ను గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

నేడు బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం, జూలై 13: పుదుచ్చేరిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 2024-25 ఏడాదికి ప్రభుత్వ సీట్ల భర్తీకి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షను పుదుచ్చేరి ప్రభుత్వం తొలిసారిగా నిర్వహిస్తుంది. యానానికి సంబంధించి స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం జరిగే పరీక్షకు ఏర్పాట్లను ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈపరీక్ష నిర్వహణకు సంబంధించి పుదుచ్చేరి నుంచి అధికారులు యానాం చేరుకున్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

యానాం, జూలై 32: యానాం శివారు సావిత్రినగర్ గ్రామంలో మూడు నెలల నుంచి మంచినీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సావిత్రినగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు ఆరోపించారు. గ్రామస్తులతో కలిసి ఆయన శనివారం ఆర్ఏ మునిస్వామి, ప్రజాపనులశాఖ అధికారులను కలిసి సమస్యను వివరించారు. గ్రామంలో ప్రజలకు సరిపడా మంచినీటిని సరఫరా చేయాలని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

మేరీమాత ఆలయానికి పాదయాత్ర



కాలినడకన గౌరిపట్నం వెళ్తున్న మాచవరం దళితపేట వాసులు

రాయవరం, జూలై13: ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు విజయం సాధిస్తే గౌరిపట్నం మేరీమాత ఆలయానికి కాలినడకన వస్తామని టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు కోడి చిన్న అప్పారావు మొక్కుకున్నారు. శనివారం అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కాలినడకన వెళ్లి గౌరిపట్నం వెళ్లి మేరీమాతను దర్శించుకుని మొక్కుతీర్చుకున్నారు. పాదయాత్ర చేసిన వారిలో కొమ్ము సురేష్, దుల్ల రమణ, తాతపూడి శ్రీను, కోడి అప్పన్న, కొండ్రు లక్ష్మీ, కొమ్ము బేబి, దుల్ల చిన్నారి ఉన్నారు.

రజక సంఘ వార్షికోత్సవం

రావులపాలెం, జూలై 13: ఈతకోటలోని ఉషోదయ రజక యువజన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్లేశ్వరపు వీరన్న, ఎం.రామచంద్రరావు, నాగార్జునుడు, రామకృష్ణ, రామమోహనరావు, దేవయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రామేశ్వరం యాత్రకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

రావులపాలెం, జూలై 13: రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి రామేశ్వరం ఏడు రోజుల యాత్రకు బయలుదేరిన బస్సును డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల రామేశ్వరం యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీరంగం, జంబుకేశ్వరం, మధురై, రామేశ్వరం, ధనుష్కోటి, తంజావూరు, స్వామిమలై, కుంభకోణం, తిరువారూర్, తిరుకడయూర్, చిదంబరం, కాంచీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ దర్శనాల అనంతరం బస్సు రావులపాలెం చేరుకుంటుందని ఆయన తెలిపారు.